# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 18, జనవరి 2026


# రక్తదానం చేసిన ఎమ్మెల్యే

## అన్ని దానాల కన్న రక్తదానం గొప్పది:బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, జనవరి 16, ప్రభాతవార్త:

అన్ని దానాల కన్న రక్తదానం గొప్పదని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం ఇచ్చొడ మండల కేంద్రంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో కీ.శే. సురుకుంటి శ్రీధర్ రెడ్డి జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. యువతకు ఆదర్శంగా నిలిచే విధంగా మొదటగా ఆయనే రక్తదానం చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిల్ జాదవ్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో రక్తదానాల శాతం తక్కువగా ఉందని, దానిపై అవగాహన పెంచేందుకు తాను ముందుగా రక్తదానం చేసినట్లు తెలిపారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసిన యువతి, యువకులను ఆయన అభినందించారు. కీ.శే. సురుకుంటి శ్రీధర్ రెడ్డి గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్న మిగతా 2లో..



# వలస వేదన...

- గుడిసెల్లో నలుగుతున్న వలస కూలీల జీవితాలు
- వసతులు లేక తీవ్ర అవస్థలు
- కాగితలకే పరిమితం అవుతున్న కార్మిక చట్టాలు



పెంచికల్ పేట్, జనవరి 17, ప్రభాతవార్త :

పొలాల్లో పంట పండితే చాలు... ఆ పంట వెనుక ఉన్న కూలీ జీవితం ఎవరికీ అవసరం లేదా? ఇదే నేడు కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వలస కూలీల స్థితిగతులపై నిలుస్తున్న ఘాటు ప్రశ్న. వ్యవసాయ పనుల నిమిత్తం ఇతర రాష్ట్రాల నుంచి వందల సంఖ్యలో వలస కూలీలు జిల్లాకు తరలివస్తున్నారు. పత్తి, మిర్చి, వరి నాటు పనులు కలుపు తీయడం వంటి కష్టసాధ్యమైన పనులతో రైతు పొలాలను పండిస్తున్నారు. కానీ పని ముగిశాక వారి జీవితం గౌరవంగా ఉందా అన్న ప్రశ్నకు సమాధానం మాత్రం దొరకడం లేదు. పొలాల చుట్టుపక్కన తాత్కాలిక గుడిసెలే వారి ఇళ్లు. తాగునీరు లేదు... మరుగుదొడ్లు లేవు... విద్యుత్ సదుపాయాలు అందని ద్రాక్షే. చలి వర్షం ఎండ మూడు కాలాలు వారికి శత్రువులే. గర్భిణీలు, చిన్నారులు అనారోగ్యాల బారినపడుతున్నా చికిత్సకు చేరే దారి కనిపించడం లేదు. కార్మిక చట్టాలు వలస కూలీలకు భద్రత, నివాస వసతులు వైద్య సదుపాయాలు కల్పించాలంటున్నాయి.

2 లో..





# నా భారత్.. నా ఓటు

## మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



నస్పూర్, జనవరి 17, ప్రభాతవార్త

ఈ నెల 25వ తేదీన 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో ఓటరు దినోత్సవ వేడుకలను అన్ని శాఖల సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. 16వ జాతీయ ఓటరు దినోత్సవంలో "నా భారత్‌నా ఓటు" అనే నినాదంతో అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా వివిధ రకాల కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పరచడం జరుగుతుందని తెలిపారు. ఓటరు దినోత్సవ సంబంధిత పోస్టర్లు, బ్యానర్లు, ప్రసార మాధ్యమాలు, ప్రచార కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని, ఎన్నికలలో తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఓటరు దినోత్సవ నినాదాన్ని ప్రతిబింబించేలా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్లను ఓటు వేసేలా ప్రోత్సహిస్తూ వారిని స్ఫూర్తిదాయకంగా చూపించడం జరుగుతుందని, బ్యాంకులు, పోస్టాఫీసులు, రైల్వే, పంచాయతీరాజ్ ఇతర శాఖల మిగతా 2లో..

## నిర్మల్ ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లను

# త్వరగా పూర్తి చేయాలి

❋ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ రూరల్, జనవరి 17, ప్రభాతవార్త:

నిర్మల్ ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్మల్ ఉత్సవాల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 19 నుంచి 23 వరకు అయిదు రోజుల పాటు నిర్మల్ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. పోయిన సంవత్సరం నిర్మల్ ఉత్సవాల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, మిగతా 2లో..





# వలస వేదన...

(మొదటిపేజీ తరువాయి)

కానీ క్షేత్రస్థాయిలో ఆ చట్టాలు ఎక్క? కాగితాల మీద ఉన్న హక్కులు గుడిసెల్లో ఉన్న కూలీలకు ఎందుకు చేరడం లేదు? ఇది వ్యవస్థ వైఫల్యమే మానవీయతకు మచ్చగా మారుతోంది. వలస కూలీల పిల్లలు విద్యకు దూరమవుతున్నారు. అంగన్వాడి పాఠశాలల జాడలే లేవు. మహిళా కూలీలు భద్రత సమస్యలతో భయభ్రాంతులకు గురవుతున్నారు. అయినా ఈ దృశ్యాలపై అధికార యంత్రాంగం ఎందుకు కళ్ళు మూస్తోంది.? అధికార ప్రజాప్రతినిధుల పర్యటనలు ఎక్క? రైతు సాగు కొనసాగాలంటే వలస కూలీల శ్రమ తప్పనిసరి. ఆ శ్రమకు గౌరవం ఇవ్వకపోతే వ్యవసాయం నిలబడుతుందా? తాత్కాలిక నివాస శిబిరాలు, తాగునీటి సరఫరా, మొబైల్ వైద్య సేవలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి. కార్మిక చట్టాల అమలుపై కఠిన పర్యవేక్షణ చేపట్టాలి. పొలాల్లో పంట పండే ప్రతి చేతికి భద్రత, గౌరవం, మానవీయత కల్పించడమే అధికార ప్రజాప్రతినిధుల బాధ్యత. వలస కూలీల గుడిసెల్లో వెలిగే దీపం పాలనలోని సున్నితత్వానికి అసలైన పరీక్షగా నిలవాల్సిందే.

### కార్మిక చట్టాలు వలస కూలీలకు వర్తింపచేయాలి

**(చప్పిడి ప్రకాష్, సామాజిక కార్యకర్త పెంచికల్‌పేట్)**



వలస కూలీలు వ్యవసాయనికి కీలక శక్తి. అయినా వారి జీవితాలు అణగారిన స్థితిలో ఉన్నాయి. పని గంటల పరిమితి, ప్రమాద భీమా, భద్రతా చర్యలు, పని ప్రదేశాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, నివాస వసతులు కల్పించకపోవడం మానవ హక్కుల ఉల్లంఘనతో సమానం. వలస కూలీలను ప్రభుత్వం, అధికారులు గుర్తించి రిజిస్ట్రేషన్ చేయాలి. కార్మిక చట్టాలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు కావాలి.

### పని చేస్తున్నాం... బతకడం కష్టం అవుతుంది( హార్బన్స్ కౌర్, కిమ్బిల్ కిడి, ఉత్తరప్రదేశ్ )



పనికి వెళ్లి ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడుతున్నాం కానీ నివాసం ఉండే చోట గుడిసెలే దిక్కు, తాగడానికి నీళ్లు కూడా సరిగా ఉండవు. మరుగుదొడ్లు ఉండవు చిన్న పిల్లల్ని వదిలి పనికి వెళ్లడం భయంగా ఉంటుంది. వైద్య సహాయం అందదు, భద్రత దృష్ట్యా భయానికి గురవుతున్నాం. మహిళలుగా చెప్పుకోలేని ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మేము కూలీలమే అయినా, మనుషులుగా మానవీయకోణంతో చూసి మాకు అధికారులు వసతులు కల్పించాలని వేడుకొంటున్నాం.

### వసతులు కల్పించి ఆదుకోవాలి...

**( మిల్కిత్ సింగ్, కిమ్బిల్ కిడి, ఉత్తరప్రదేశ్ )**




పని కోసం రాష్ట్రాలు దాటి వలస వస్తున్నాం పొలాల్లో పని చేస్తూ కష్టపడుతున్నాం తాత్కాలిక గుడిసెలు వేసుకొని కాలంతో సంభంధం లేకుండా జీవించాల్సి వస్తుంది మాకు వసతులు ఏమి అందుబాటులో ఉండవు, శ్రమకు తగిన ఫలితం ఉండదు. మాతో పాటు మా పిల్లలు అనేక ఇబ్బందులు పడుతుంటారు. సర్కారు, అధికారులు మాపై కరుణ చూపి మెరుగైన వసతులు కల్పించి మా జీవితాలకు తోడ్పాటును అందించాలి .



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

# ముందుకు సాగుతున్న ప్రజా పాలన ప్రభుత్వం

## - 22న నాగోబా దర్బార్‌కు ఉపముఖ్యమంత్రి, మంత్రుల రాక

**ఉట్నూర్, జనవరి 17, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా ప్రజా పాలన ప్రభుత్వం ముందుకు కోన సాగుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదిలాబాద్, నిర్మల్ పర్యటనను విజయవంతం చేయడానికి కృషి చేసిన ప్రభుత్వ సలహాదారులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.ఈనెల 22న కెస్లాపూర్ నాగోబా జాతర సందర్భంగా నిర్వహించే ప్రజా దర్బార్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండ సురేఖ, వివేక్ వెంకటస్వామి వస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. కేస్లాపూర్ నాగోబా ఆలయ అభివృద్ధికి 22 కోట్ల రూపాయల నిధులు మంజూరు కోసం ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని,నిన్న జరిగిన ముఖ్యమంత్రి సభలో జిల్లాకు వరాల జల్లు కురిపించారని, బ్యారేజీల ప్రారంభంతోపాటు అభివృద్ధి పనులను ప్రారంభించి మహిళా సంఘాలకు రూ.550 కోట్ల రుణాల నిధుల పత్రాలను అందజేశారని ఎమ్మెల్యే తెలిపారు. ఖానాపూర్ మున్సిపాలిటీలో రూ.15 కోట్ల అభివృద్ధి పనులు నిర్మల్ మున్సిపాలిటీలో రూ.15 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఆదిలాబాద్ ఆర్టిఏ మెంబర్ దూట రాజేశ్వర్, జై నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ జై వంతరావు, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంపల్లి చంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇక్బాల్ నాయకులు పాల్గొన్నారు.

## నిర్మల్ ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లను

# త్వరగా పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందామని అన్నారు. నిర్మల్ జిల్లా చరిత్ర, సాంస్కృతిక వారసత్వాన్ని నిర్మల్ ఉత్సవాల వేదిక ద్వారా ఆవిష్కరించామని, ఈ సంవత్సరం కూడా రెట్టించిన ఉత్సాహంతో అధికారులంతా సమన్వయంతో పనిచేసి నిర్మల్ ఉత్సవాలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వహణకు సంబంధించి ఎన్టీఆర్ స్టేడియం సుందరీకరణ పనులు, తదితర ఏర్పాట్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. పార్కింగ్ కొరకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని సూచించారు. హెల్మెట్ ధరించి, నిర్మల్ ఉత్సవాలకు హాజరయ్యే ద్విచక్ర వాహనదారులకు పార్కింగ్ రుసుము పూర్తిగా రాయితీ ఉంటుందని అన్నారు. జిల్లాలోని పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మల్ ఉత్సవాలకు ప్రోటోకాల్ ప్రకారం అందరికీ ఆహ్వానాలు అందించాలని అన్నారు. నిర్మల్ ఉత్సవాల విజయవంతానికి విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్నకళ్యాణి, డిఈఓ భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డిఆర్డివో విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన బెల్లంపల్లి సిఓఈ విద్యార్థి

**బెల్లంపల్లి, జనవరి 17, ప్రభాతవార్త**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్సీ బెల్లంపల్లిలో 9వ తరగతి చదువుతున్న ఎలకటూరి రోహిత్ డిసెంబర్ 5,6,7 తేదీల్లో తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 14 క్రికెట్ పోటీలలో అదిలాబాద్ జిల్లా జట్టు నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అవడం పట్ల పాఠశాల ప్రిన్సిపల్ ఆకిడి విజయసాగర్ శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు. అదేవిధంగా మంచిర్యాల్ ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ ఎండి యాకుబ్ విద్యార్థికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ తన్నీరు గోపి, సీనియర్ ఉపాధ్యాయులు దశరథం, కొండల్ రావు విద్యార్థికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా డిసిఓ రమా కళ్యాణి జాతీయస్థాయి అండర్ 14 క్రికెట్ కి సెలెక్ట్ అయిన రోహిత్ కి అభినందనలు తెలుపుతూ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ నెల 19వ తారీకు నుంచి రాజస్థాన్ రాష్ట్రంలోని సికార్ జిల్లా చూరు పట్టణంలో జాతీయస్థాయి పోటీలు ప్రారంభం అవుతాయని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాల నుంచి జాతీయస్థాయి అండర్ 14 క్రికెట్లో ఎంపిక అవడం అంటే మాకు దక్కిన గొప్ప గౌరవం అని భావిస్తున్నానని, అదే విధంగా క్రమశిక్షణతో పట్టుదలతో శిక్షణ ప్రారంభిస్తే విద్యార్థులు తమ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఇది మంచి ఉదాహరణ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, వ్యాయామ ఉపాధ్యాయులు అల్లూరి వామన్, ముత్యకుర్తి రాజశేఖర్ విద్యార్థిని అభినందించి ఆల్ ద బెస్ట్ చెప్పారు.



# రక్తదానం చేసిన ఎమ్మెల్యే

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్యంతో ఇచ్చోడ మండల కేంద్రంలో వివేకానంద విద్యాసంస్థలను స్థాపించారని చెప్పారు. ఆయన సేవల వల్ల అనేక మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నా భారత్.. నా ఓటు

(మొదటిపేజీ తరువాయి)

సమన్వయంతో, కార్పొరేట్ సంస్థలు, సొసైటీల ఆధ్వర్యంలో వ్యాసరచన, ఉపన్యాసం, వెబినార్, సెమినార్ల ద్వారా ప్రజలందరికీ తెలిసేలా ఓటు ఆవశ్యకతను వివరించడం జరుగుతుందని తెలిపారు. నూతనంగా నమోదు కాబడిన ఓటర్లను గుర్తించి వారికి ఓటరు గుర్తింపు కార్డులను అందించడం జరుగుతుందని, ప్రాంతీయ భాషలో ఈవిఎం, వివి ప్యాట్, పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలు, హెల్ప్‌లైన్ యాప్, ఓటు విలువ తదితర అంశాలపై ప్రజలకు అర్థమయ్యే రీతిలో వీడియోలు రూపొందించి ప్రదర్శించడం జరుగుతుందని, దినపత్రికలు, ఛానళ్ళు, హోర్డింగుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని, ఓటరు ప్రతిజ్ఞ వాట్సాప్ గ్రూపుల ద్వారా అందరికీ చేరే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్న జాతీయ ఓటరు దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అందరు కలిసి రావాలని అన్నారు.

# పావన మడుగు అభివృద్ధికి కృషి చేస్తాం



వార్షికోత్సవ సందర్భంగా పాఠశాలలో పాల్గొన్న ఎమ్మెల్యే చిత్రం

## వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

మంచిర్యాల, జనవరి 17, ప్రభాతవార్త

మంచిర్యాల పట్టణంలోని సెవెన్ హిల్స్ హై స్కూల్ 50వ వార్షికోత్సవ కార్యక్రమంలో మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.



చెక్కును అందజేస్తున్న బిజెపి నాయకులు

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత

పెంచికల్ పేట్, జనవరి 17, ప్రభాతవార్త :

మండలంలోని పెంచికల్ పేట్ గ్రామానికి చెందిన ఎల్లూరి పద్మకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైనా రూపాయలు 48,000 వేల చెక్కును శనివారం బిజెపి నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అనారోగ్యంతో వైద్య చికిత్స పొందిన లబ్ధిదారులకు దళారుల జోక్యం లేకుండా నేరుగా చెక్కులు అందించాలని ఎమ్మెల్యే హరీష్ బాబు ఆదేశాల మేరకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కుకిడే రాజేష్ ఎల్లూర్ సర్పంచ్ రవీందర్ నాయకులు సత్యనారాయణ, నారాయణ, రామన్న శోభన్ తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా మున్సిపల్ వార్డుల రిజర్వేషన్ ప్రక్రియ

ఆసిఫాబాద్, జనవరి 17, ప్రభాతవార్త :

త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని మున్సిపల్ వార్డుల రిజర్వేషన్ పారదర్శకంగా నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మున్సిపల్ అధికారులతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ వార్డుల వారీగా రిజర్వేషన్ కేటాయింపు ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో 20 వార్డులు, కాగజ్ నగర్ మున్సిపల్ పరిధిలో 30 వార్డులకు డెడికేషన్ కమిషన్ కేటాయింపు ప్రకారం రిజర్వేషన్ ప్రక్రియ నిర్వహించడం జరిగిందని తెలిపారు. మహిళలకు కేటాయించిన వార్డులను లాటరీ పద్ధతిలో రిజర్వేషన్ కేటాయించడం జరిగిందని, షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, జనరల్ మహిళలకు 50 శాతం సీట్లను మహిళలకు కేటాయించడం జరిగిందని తెలిపారు. రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ కమిషనర్లు గజానన్, రాజేందర్, పట్టణ ప్రణాళిక అధికారి యశ్వంత్, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



రిజర్వేషన్ కేటాయింపు ప్రక్రియలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి

తిర్యాని, జనవరి 17, ప్రభాతవార్త:

మండలంలోని గడలపల్లి గ్రామపంచాయతీలోని పావన మడుగు అభివృద్ధికి కృషి చేస్తామని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. శనివారం పావన మడుగు వద్ద గల జై జంగో జై లింగో ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొని మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం ఆమే మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఒకప్పుడు పాండవులు వనవాసం ఉన్న ప్రాంతంగా ప్రసిద్ధి చెందిందన్నారు. పావన మడుగును పర్యాటక ప్రాంతంగా చేసేందుకు ప్రత్యేక నిధులతో అభివృద్ధికి బాటలు వేస్తామని హామీ ఇచ్చారు. ఆదివాసులు ఐక్యంగా ఉండాలని అప్పుడే తమ హక్కులను సాధించుకోవచ్చన్నారు.

### సుంగాపూర్‌లో భీమయ్యక్ ఆలయాన్ని నిర్మిస్తాం...

మండలంలోని సుంగాపూర్‌లో భీమయ్యక్ జాతర సందర్భంగా శనివారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి భీమయ్యక్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలాం గిరిజన సంప్రదాయబద్ధంగా నృత్యాలు చేసి దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే జాతర వరకు ఆలయ నిర్మాణం చేపడతామని హామి ఇచ్చారు. అనంతరం ఐటిడిఏ ఏపీవో శ్యామల మాట్లాడుతూ జాతర నిర్మాణ కోసం ఐటిడిఏ నుండి ప్రత్యేక నిధులు మంజూరయ్యే విధంగా పిఒకు వివరిస్తామని పేర్కొన్నారు. అనంతరం క్రీడాకారులకు బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యేను, ఏపివోలను సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు ఆత్రం శంకరమ్మ, వేడ్మా నరేష్, రేణుక నైతం మంగు, రాధ బాయి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు హన్మండ్ల జగదీష్, సిడాం అర్జు మాస్టర్, మడావి గుణవంత్ రావు, జిల్లా సర్‌మేడి కుర్సెంగ మోతిరాం, మాజీ ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, మాజీ జడ్పీటీసీలు వెడ్మ కమల, ఆత్రం చంద్రశేఖర్, గిన్నేధరి సర్‌మెడి అడ తాను, మర్సుకోల కమల బాయి, ఆత్రం సంతోష్, గడలపల్లి గ్రామ పటేల్ దుర్వ చిత్రు, కుడ్మేత జైవంత్ రావు, భీమయ్యక్ జాతర నిర్వహణ కమిటీ సభ్యులు, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



జంగో లింగో వద్ద పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎంవిఐ అల్లే శ్రీనివాస్

# రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలి

- ఎంవిఐ అల్లే శ్రీనివాస్

బజార్‌హత్నూర్, జనవరి 17, ప్రభాతవార్త:

వాహనదారులకు, ఆటో డ్రైవర్లకు ఎంవిఐ అల్లే శ్రీనివాస్ రోడ్డు భద్రత నియమ నిబంధనలు ప్రతీ ఒక్కర్రు పాటించాలని ఎంవిఐ అల్లే శ్రీనివాస్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని చందునాయక్ తాండలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అంతకు ముందు గ్రామస్తులు ఎంవిఐ అల్లే శ్రీనివాస్‌కు ఘన స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంవిఐ మాట్లాడుతూ రహదారి భద్రత ప్రాముఖ్యతపై మాట్లాడుతూ డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వాడకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లు వాహనాలు నడపరాదని అన్నారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల వారి తల్లితండ్రులకు శిక్ష పడుతుందని తెలిపారు. వేగంగా వాహనాలు నడపడం వల్ల డ్రైవర్‌కు వాహనంపై నియంత్రణ తగ్గిపోతుందని తెలిపారు. ఆటోలో నిబంధనల ప్రకారం డ్రైవర్‌తో పాటు ముగ్గురు మాత్రమే ప్రయాణించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం వల్ల ప్రయాణికులు ఇబ్బందికి గురవుతారన్నారు. డ్రైవర్ బాధ్యతగా ఆటోలో నిర్ణయించిన పరిమితిలోనే ప్రయాణికులను తీసుకెళ్లాలన్నారు. ఆటో డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, కేవలం నిర్ణయించిన సీట్లలోనే ప్రయాణికులను అనుమతించి, ఇది నా భాధ్యత నేను ప్రయాణికులను సరైన గమ్యస్థానాలకు చేరుస్తా అనే నమ్మకాన్ని ప్రయాణికులలో కలిగించాలి అన్నారు. బైకులు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. కారు నడిపేటప్పుడు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. వాహన దారులు తమ యొక్క డ్రైవింగ్ లైసెన్స్, వాహనం యొక్క రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, బీమా సర్టిఫికేట్, కాలుష్య తనిఖీ సర్టిఫికేట్, ఫిట్నెస్ సర్టిఫికేట్, పర్మిట్ వాహనంలో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ షేక్ రజాక్, ఎంవిఐ అల్లే శ్రీనివాస్, ఎం శ్వేత, గ్రామస్తులు, వాహనదారులు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## చెప్రాడకు ప్రారంభమైన 21వ మహాపాదయాత్ర

బెజ్జూర్, జనవరి 17, ప్రభాతవార్త:

బెజ్జూర్ మండలంలోని ఎలుక పల్లి గ్రామం నుండి శనివారం చెప్రాడకు భక్తులు 21వ మహా పాదయాత్రను ప్రారంభించారు. ఈ పాదయాత్రలో కుకుడ, పోతేపల్లి, బారెగూడ, రుద్రాపూర్, చింతల మానేపల్లి మీదుగా వెళ్లారు. ఆయా గ్రామాల్లో భక్తులకు తేనీరు, అల్పాహారం ఆయా గ్రామస్తులు అందించారు. మాజీ ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా జావిద్, మాజీ ఎంఎల్ఏ కోనేరు కోనప్ప ఆదేశానుసారం బెజ్జూర్ సర్పంచ్ దుర్గం సరోజ తిరుపతి అరటి పండ్లు, వాటర్ బాటిళ్లను భక్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, కోనేరు అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.



## ముగిసిన మండల స్థాయి క్రికెట్ పోటీలు

సారంగాపూర్, జనవరి 16, ప్రభాతవార్త:

మండలంలోని కౌట్ల(బి) గ్రామంలో మండల స్థాయి క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. పోటీలలో ప్రథమ, ద్వితీయ విజేతలుగా కౌట్ల(బి) గ్రామానికి చెందిన క్రీడాకారులు గెలుపొందారు. వారికి మాజీ డీసీఎంఎస్ నారాయణరెడ్డి, ఉపసర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, పత్తిరెడ్డి సాయినాథ్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ట్రోఫీతో పాటు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్, సత్యపాల్ రెడ్డి, శివారెడ్డి, లక్ష్మారెడ్డి, పుండ్రుభీమ్ రెడ్డి, వెంకటరెడ్డి క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న అతిథులు

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నిర్మాణ స్థల పరిశీలన

**వాంకిడి, జనవరి 17, ప్రభాతవార్త:**

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నిర్మాణ స్థలాన్ని పరిశీలించడం జరిగిందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లాలోని వాంకిడి మండలం బెండార గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నిర్మాణం కొరకు పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నియోజకవర్గానికి 200 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నిర్మాణానికి చర్యలు చేపడుతుందని తెలిపారు. గురుకులంలో విశాలమైన గదులు, పాఠశాల భవనాలు, క్రీడాస్థలం ఏర్పాటుకు సుమారు 25 ఎకరాల ప్రభుత్వ భూమి అవసరం ఉంటుందని, సర్వే అధికారులు, టిజిఈడబ్ల్యుఐడిసి అధికారులు వెంటనే స్థలానికి హద్దులు నిర్ధారించి చదువును చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం త్వరలోనే పనులు ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నిర్మాణం ద్వారా ఈ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య, సాంకేతికత, నైపుణ్యతతో కూడిన శిక్షణ లభిస్తుందని తెలిపారు. భవన నిర్మాణాలు చేపట్టి వచ్చే విద్యా సంవత్సరం అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, వాంకిడి మండలాల తహసిల్దార్లు రియాజ్ అలీ, కవిత, వాంకిడి సర్వేయర్లు పుల్గం రామకృష్ణ, టిజిఈడబ్ల్యు ఐడిసి ఇంజనీర్ కిరణ్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



స్థలంను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



అవగహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సుప్రియ

## బాలికల సాధికారతపై అవగహన

**పెంచికల్ పేట్, జనవరి 17, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని పీఎం శ్రీ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో శనివారం ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు యాదగిరి ఆధ్వర్యంలో బాలికల సాధికారత పై అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలో పదవ తరగతి వరకు చదువుకొని డాక్టర్ గా ఉద్యోగం సాధించిన ఎల్కపల్లి గ్రామానికి చెందిన చిలువేరు సుప్రియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల్లో కౌమర దశలో వచ్చే శారీరక మార్పులు, ఋతుచక్రం పట్ల ఉండే అపోహలను తొలగించేలా సూచనలు చేశారు. పిల్లల్లో ఆకస్మికంగా మొదలయ్యే ఒత్తిడి వలన చెడు వ్యాసనాలకు దూరంగా ఉండేలా సూచించారు. ఈ కార్యక్రమంలో గంగా భవాని, లక్ష్మి, భాగ్య, భారతి తదితరులు పాల్గొన్నారు.

## సిఐఎస్ఎఫ్ ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం

**నేరడిగొండ, జనవరి 17, ప్రభాతవార్త:**

నెరడిగొండ మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన చౌహన్ బాలాజీ కుమారుడు చౌహన్ వీరేందర్ జాతీయ స్థాయిలో సిఐఎస్ఎఫ్ ఉద్యోగం సాధించిన సందర్భంగా నెరడిగొండ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ యువకుడిని సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా అనిల్ జాదవ్ మాట్లాడుతూ గిరిజన యువకులు చదువులో రాణించి జాతీయ స్థాయి ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని అన్నారు. చౌహన్ వీరేందర్ సిఐఎస్ఎఫ్ ఉద్యోగం సాధించడం ద్వారా నియోజకవర్గ యువతకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. కష్టపడి చదివితే ఉన్నత అవకాశాలు సాధించవచ్చని ఈ విజయం నిరూపిస్తోందని తెలిపారు.





## ఆసియా వాటర్ బర్డ్ సెన్సస్‌లో భాగంగా దేగామా-బజార్హత్నూర్ చెరువులో పక్షుల గణన

**ఆదిలాబాద్, జనవరి 17, ప్రభాతవార్త:**

ఆసియా వాటర్ బర్డ్ సెన్సస్ (ఏడబ్ల్యుసి) కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ, డబ్ల్యుడబ్ల్యుఎఫ్ సమన్వయంతో వార్షిక జలచర పక్షుల గణన నిర్వహించారు. ఈ సందర్భంగా బజార్హత్నూర్ మండలంలోని దేగామా-బజార్హత్నూర్ చెరువులో బర్డ్ వాచింగ్ చేపట్టారు. ఈ గణనలో హిమాలయ పర్వత ప్రాంతం నుంచి వచ్చిన బార్ హెడెడ్ గూస్, ఇంగ్లాండ్ ప్రాంతానికి చెందిన పిన్‌టైల్, ఇతర దేశాలకు చెందిన వలస పక్షులు చెరువుకు చేరినట్లు గుర్తించారు. ఈ ప్రాంతంలో దాదాపు 80 రకాల జలచర పక్షులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ఎస్ చిన్న విశ్వనాథ్ బుసరడ్డి, ఎఫ్ఆర్ఓ టి పుండలిక్, డివైఆర్ఓ ప్రవీన్ కుమార్, ఎఫ్‌బిఓ కేశవ్, బజార్హత్నూర్ అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న, లైన్స్ క్లబ్ మరియు రెడ్డి సంఘం సభ్యులు

## రెడ్డి సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**మంచిర్యాల, జనవరి 17, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం రోజు లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల కార్యాలయంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ వైద్యులు డాక్టర్ సుగుణాకర్ రెడ్డి , డాక్టర్ రాకేష్ రెడ్డి , ప్రముఖ విద్యావేత్త డాక్టర్ తుమ్మల మల్లారెడ్డి, పాల్గొని క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు గుర్రం మోహన్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి నరహరి శ్రీధర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, రెడ్డి బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని నూతన సంవత్సరంలో చేపట్టబోయే సామాజిక సేవా కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం తరపున నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలి

**బజార్‌హత్నూర్, జనవరి 17, ప్రభాతవార్త**

మండలంలోని ఆదర్శ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి, పరీక్ష షెడ్యూల్ విడుదల అయ్యాయని, ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ వి సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు, ఏడు నుంచి పదో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం విద్యార్థులు ఈ నెల 28 నుంచి వచ్చే నెల 28 వరకు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 9 నుంచి హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోని, ఏప్రిల్ 19న ఆదివారం ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. 6వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 7వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.



బహుమతులు అందజేస్తున్న అధికారులు

## రోడ్డు భద్రతపై పాఠశాలలో వ్యాస రచన చిత్రాలేఖన పోటీలు

**సారంగాపూర్, జనవరి 17, ప్రభాతవార్త:**

మండలంలోని బీరవేల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించి ప్రజల ప్రాణ భద్రతను కాపాడాలనే లక్ష్యంతో తెలంగాణ పోలీస్, రవాణా, ఆరోగ్య శాఖలు సంయుక్తంగా అరైవ్ అలైవ్ - 2026 పేరిట 10 రోజుల రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమం మూడో రోజులో భాగంగా సారంగాపూర్ ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో భీరవెల్లిలో రోడ్డు భద్రత మన బాధ్యత పైన విద్యార్థిని, విద్యార్థులకు వ్యాస రచన చిత్ర లేఖన పోటిలు నిర్వహించారు. విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాల గురించి క్లుప్తంగా వివరించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ సాయన్న, పోలీసు సిబ్బంది ఆకాష్, ప్రణీత్ రెడ్డి, వినిల్, మాధవ్ పాల్గొన్నారు.

## మున్సిపల్ వార్డుల మహిళా రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ పూర్తి

**నిర్మల్ రూరల్, జనవరి 17, ప్రభాతవార్త:**

మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి, జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల వార్డుల మహిళా రిజర్వేషన్లను శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖరారు చేశారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్వయంగా పాల్గొని, మున్సిపాలిటీలలో వార్డుల వారిగా కేటాయించిన రిజర్వేషన్ వివరాలను తెలుపుతూ, లాటరీ పద్ధతి ద్వారా ఎస్టీ, ఎస్సీ, బీసీ, జనరల్ వారీగా మహిళలకు కేటాయించే వార్డులను ఎంపిక చేశారు. ముందుగా కలెక్టర్ మాట్లాడుతూ, నిబంధనల ప్రకారం సిపెక్ సర్వే జనాభా ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేస్తున్నట్లు వివరించారు. ప్రక్రియను మొత్తం పకడ్బందీ వీడియోగ్రాఫ్ పర్యవేక్షణలో నిర్వహించామని వివరించారు. ఈ మహిళా రిజర్వేషన్ల ఖరారు కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, సుందర్ సింగ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నూతన సర్పంచులకు శిక్షణ తరగతులు

**దహెగాం, జనవరి 17,ప్రభాతవార్త :**

మండలంలోని నూతనంగా ఎన్నికైన సర్పంచులకు ఈ నెల 20 తేదీ నుండి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి నసిరుల్లా ఖాన్ తెలిపారు. దహెగాం మండలంలోని 24 మంది సర్పంచులకు మొదటి బ్యాచ్ లో జనవరి 20 తేదీ నుండి 24 తేదీ వరకు ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 6:30గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయని అన్నారు. కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ కార్యాలయ సమీపంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో శిక్షణ తరగతులు ఉంటాయని వెల్లడించారు.



నియామక పత్రం అందుకున్న రాహుల్

## గ్రూప్ మూడు నియామక పత్రం అందుకున్న రాహుల్

**ఉట్నూర్, జనవరి 17, ప్రభాతవార్త**

పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యం మని ఉట్నూర్ మండలం శ్యామ్ నాయక్ తండా కు చెందిన పవార్ రాహుల్ నిరూపించారు. ప్రస్తుతం పోలీస్ శాఖా లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న అయన గ్రూప్ మూడు ఫలితాలో ప్రతిభ చాటి ట్రేజరి విభాగంలో సీనియర్ అకౌంట్ టెంట్ గా నియామక పత్రం అందుకున్నారు. విధి నిర్వహణలో ఉంటూనే ఉన్నాత ఉద్యోగం సాధించిన రాహుల్ ను గ్రామస్తులు, తోటి ఉద్యోగస్తులు, సిబ్బందిలు అభినందించారు.

## మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ

**- యువతకు, మహిళలకు ప్రాదాణ్యత**

**- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డీనేటర్ మంతెన సంపత్ కుమార్ స్పష్టీకరణ**

బెల్లంపల్లి, జనవరి 17, ప్రభాతవార్త

మున్సిపల్ ఎన్నికల్లో బెల్లంపల్లి మున్సిపాల్టీలో జనసేన పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ మంతెన సంపత్ కుమార్ తెలిపారు. శనివారం బెల్లంపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కోల్బెల్టు ప్రాంతంలో జనసేన పార్టీకి ప్రజల్లోఎంతో ఆదరణ ఉందని తెలిపారు. జన సైనికులకు టికెట్లు ఇచ్చేందుకు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నాయకత్వంలో సన్నద్ధమవుతున్నట్లు సంపత్ కుమార్ వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకే పార్టీ అధిష్టానం ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేసిందని ఆయన వివరించారు. జన సైనికులకు టికెట్లు ఇచ్చే విషయంలో వ్యూహరచన చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు మంచిర్యాల కార్పొరేషన్ లో కూడా జనసేన పార్టీ పోటీ చేస్తుందని ఆయన వివరించారు. ఎన్నికల్లో తమ పార్టీ యువతకు, మహిళలకు తగు ప్రాధాన్యతని ఇస్తుందని పేర్కొన్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ 34 వార్డుల్లో జన సైనికులు పోటీ చేస్తారని ఆయన స్పష్టం చేశారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో 34 మున్సిపల్ వార్డు స్థానాలను జనసేన పార్టీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. జన సైనికులను రాజకీయ నాయకులుగా చేసేందుకు తమకు అవకాశం వచ్చిందని సంపత్ కుమార్ వివరించారు. మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ బలాన్ని నిరూపిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జనసేన రాష్ట్ర యూత్ అడహక్ కమిటి సభ్యుడు మాయ రమేష్, విద్యార్థి విభాగం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆవుల సాగర్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నాయకులు సలిగంటి శ్రీనివాస్, మేకల పవన్ కళ్యాణ్, ముడుపు ప్రణయ్, శనిగారపు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జనసేన పార్టీ నాయకులు

### మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో

# పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష

**అటెండెన్స్, పన్నుల వసూలు, పారిశుధ్యం, ఈ–గ్రామ్ స్వరాజ్ అమలుపై ఎంపిడిఓ–ఎంపీఓల ఆదేశాలు**

**మందమర్రి, జనవరి 17, ప్రభాతవార్త**

మందమర్రి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ, ఎంపీఓలు సమస్త గ్రామ పంచాయతీ కార్యదర్శులతో శనివారం పలు కీలక అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ కార్యక్రమాల అమలు, పన్నుల వసూలు, పారిశుధ్యం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల లోపు అటెండెన్స్‌తో పాటు డి.ఎస్.ఆర్ పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఈ నెల 25వ తేదీ లోపు 100 శాతం ఇంటి పన్ను వసూలు చేసి, ఆన్లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా ప్రతిరోజూ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి, వాటి ఫోటోలను వాట్సాప్ గ్రూపులో పోస్టు చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రామ పంచాయతీలకు సంబంధించిన అన్ని రకాల రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. ఈ నెల 19వ తేదీ నుంచి సర్పంచులకు శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నందున, ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 9 గంటలకు అందరూ తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన గ్రామ పంచాయతీల్లో వీఠ బిల్డింగుల నిర్మాణానికి తీర్మానాలు సమర్పించాలని, గ్రామ పంచాయతీ నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తిచేసి విత్తనాలు సేకరించుకోవాలని తెలిపారు. సర్పంచ్‌గా పోటీ చేసిన అభ్యర్థులు తమ బ్యాంకు ఖాతాల ఆదాయ–వ్యయ వివరాలు, స్టేట్‌మెంట్‌లు వెంటనే సమర్పించాలని, ఎన్నికల ఖర్చుల వివరాలు నిర్ణీత గడువులో అందజేయకపోతే అనర్హత వేటు తప్పదని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న ఆర్‌టీఐ దరఖాస్తులను వెంటనే పరిష్కరించి, కోరిన సమాచారాన్ని దరఖాస్తుదారులకు అందజేసి ఒక కాపీని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. అనంతరం ‘మేరీ పంచాయత్ – మేరీ ధరోహర్’ కార్యక్రమంపై నిర్వహించిన గూగుల్ మీట్‌లో ఎంపిడిఓ, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీపీఓ, బెల్లంపల్లి ఎంపిడిఓ, ఎంపీఓ, డీపీఎంలు వివరాలు తెలియజేశారు. ఈగ్రామ్ స్వరాజ్ వెబ్‌సైట్‌లో ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించిన ప్రత్యేకతలు, చారిత్రాత్మక నిర్మాణాలు, జాతరలు, ప్రముఖ వ్యక్తుల వివరాలను గుర్తించేందుకు సర్వే చేపట్టాలని సూచించారు. సంబంధిత ఫార్మాట్‌లో వివరాలు, ఫోటోలు సేకరించి గ్రామ సభలో చర్చించిన అనంతరం ఈ నెల 24వ తేదీలోపు వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని, ఫిబ్రవరి 3వ తేదీలోపు ఈ ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. ఇలా చేస్తే గ్రామ పంచాయతీల ప్రత్యేకతలు గూగుల్ సెర్చ్‌లో అందరికీ కనిపించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ రాజేశ్వర్, ఎంపీఓ ఎం. సత్యనారాయణతో పాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



కార్యదర్శులతో ఎంపీడీవో సమావేశం

## 15 వార్డులు.. 18,331 మంది ఓటర్లు

**లక్షెటిపేట, జనవరి 17, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డులలో మొత్తం 18,331 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 8765 మంది పురుషులు, 9565 మహిళా ఓటర్లు ఉన్నారు. రిజర్వేషన్లపై ఉత్కంఠ నెలకొన్నప్పటికీ ఆశావహులు ఇప్పటికే వారి వారి వార్డుల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి, ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. రిజర్వేషన్ కలిసి వస్తుందని ఎప్పటి నుంచో ఇంటింటికి తిరుగుతూ వారి సమస్యలపై ఆరా తీస్తూ, ఓటర్లకు దగ్గరవుతున్నారు.

### లక్షెట్టిపేట మున్సిపల్ రిజర్వేషన్లు ఖరారు..

మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని 15 వార్డులకు రిజర్వేషన్లను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రకటించారు. వాటిలో ఎస్టీ జనరల్ 7వ వార్డు, ఎస్సీ మహిళ 2, బిసి మహిళ 15, 4, 6, 8, 10, 12, ఎస్సీ జనరల్ 5,13, జనరల్ 3, 9, 14 వార్డులు కేటాయించారు. దీంతో ఆశవాహులలో ఉత్సాహం నెలకొంది.



## కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చీరల పంపిణీ

**లక్షెట్టిపేట, జనవరి 17, ప్రభాతవార్త**

మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆదేశాల మేరకు కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లక్షెట్టీపేట మండలంలోని మిట్టపల్లి, హాజీపూర్ మండలంలోని హాజీపూర్, టీకన్నపల్లి, బుద్ధిపల్లి గ్రామాల్లో ఆడపడుచులందరికీ పీఎస్ఆర్ బతుకమ్మ చీరలను మంచిర్యాల ఎమ్మెల్యే సతీమణి, జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు, కోడలు కొక్కిరాల శైలేఖ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాల స్వరంచులు , కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆడపడుచులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

**జన్నారం, జనవరి 17, ప్రభాతవార్త**



విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి అని విశ్రాంత ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కృష్ణ విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవన ఆవరణలో శనివారం విశ్రాంత ఉద్యోగుల నూతన సంవత్సర క్యాలెండరు, డైరీని మండల ఇంచార్జ్ తహసిల్దార్ రామ్మోహన్, గిర్దావర్ భానుచందర్, విశ్రాంత ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కృష్ణలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, విశ్రాంత ఉద్యోగులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. జిల్లా కార్యవర్గం మొదటి సారిగా జన్నారంకు రావడంతో మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జగన్, కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, నాగేశ్వర్, పాపారావు, శంకర్ లింగం, కైలాసం, వైకుంఠం, రాజమోళి, విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు అడ్డగూరి భూమన్న, కార్యదర్శి యాద పుల్లయ్య, లచ్చన్న, మురళి, చరణ్ దాస్, తార చంద్, దశరత్, లింగం తదితరులు పాల్గొన్నారు.

## వార్డు మెంబర్ల ఫోరమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మేకల అక్షయ్

**జన్నారం, జనవరి 17, ప్రభాతవార్త**



తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్ల ఫోరమ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతగూడ గ్రామపంచాయతీ 2వ వార్డు సభ్యుడైన మేకల అక్షయ్ కుమార్‌ని ఫోరమ్ వ్యవస్థాపకులు కొండ నవీన్ ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు జక్కని పరంధాములు నియమించారు. శనివార వారిరువురు మేకల అక్షయ్ కుమార్‌కు నియామకపత్రాన్ని అందించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఫోరమ్ బలోపేతానికి, వార్డు మెంబర్ల డిమాండ్ల సాధనకు, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. తనపై నమ్మకంతో తనను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు ఫోరమ్ వ్యవస్థాపకుడికి, రాష్ట్ర అధ్యక్షుడికి ఈ సందర్భంగా అక్షయ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

# బకాయిల సాధనకై ఛలో బస్‌భవన్

**జన్నారం, జనవరి 17, ప్రభాతవార్త**

రిటైర్ అయిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు రావలసిన 2017 పేస్కేల్ బకాయిలు వెంటనే చెల్లించాలని, హయ్యర్ పెన్షన్ కు డబ్బులు చెల్లించిన వారికి హయ్యర్ పెన్షన్ త్వరగా మంజూరు అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలనే తదితర డిమాండ్ల సాధనకు ఈ నెల 21 న తలపెట్టిన చలో బస్ భవన్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు తరలి రావాలని జన్నారం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం జన్నారంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో నాయకులు గోపి సత్యనారాయణ మాట్లాడుతూ, రాష్ట్ర సారధ్య కమిటీ ఆధ్వర్యంలో గత ఆరు నెలల నుండి మేనేజింగ్ డైరెక్టర్, ఎక్సిక్యూటివ్ డైరెక్టర్ లను ఇతర సంబంధిత అధికారులను బస్సు భవన్‌లో కలిసి అనేక సార్లు విజ్ఞాపన పత్రాలు ఇవ్వడం జరిగిందని కానీ ఇంతవరకు పరిష్కరించలేదని అన్నారు. విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన 2017 ఏరియర్స్, గ్రాజ్యుటీ తదితర పదవీ విరమణ ప్రయోజనాలు చేతికి అందక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ, జీవనం సాగిస్తున్నారని, చాలా మంది తమకు రావలసిన డబ్బులు కళ్ళ చూడకుండానే చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హయ్యర్ పెన్షన్ కొరకు అప్పులు తెచ్చి డీడీలు కట్టారని, ఏండ్లు గడిచి పోతున్నా, చాలా మందికి పెన్షన్ సాంక్షన్ కాలేదని, తెచ్చిన డబ్బులకు వడ్డీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. 2013, 2017 పేస్కేలు డాటా పూర్తి స్థాయి వివరాలు పిఎఫ్ కమిషనర్ కు పంపక పోవడం వలన పెన్షన్ తక్కువగా వస్తుందని, సరియైన వివరాలు పంపాలని అనేక సార్లు మొర పెట్టుకున్నా, బస్ భవన్ అధికారులు స్పందించడం లేదని, ఇలాంటి అనేక సమస్యలతో రిటైర్ అయిన ఉద్యోగులందరూ ఇబ్బందుల్లో ఉన్నారని ఆయన అన్నారు. అప్పులు తెచ్చి డీడీలు కట్టారని, ఏండ్లు గడిచి పోతున్నా, చాలా మందికి పెన్షన్ సాంక్షన్ కాలేదని, తెచ్చిన డబ్బులకు వడ్డీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సంస్థలో 30 నుండి 40 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకుని క్రమం తప్పకుండా నిబంధనల మేరకు ప్రావిడెంట్ ఫండ్ కు నెలనెలా కాంట్రిబ్యూషన్ చెల్లిస్తున్నప్పటికి, తిరస్కరణకు గురైన వేలాది ఉద్యోగుల హయ్యర్ పెన్షన్ దరఖాస్తులను అనుమతించాలని, వారికి డిమాండ్ నోటీస్‌లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజయ్య, బుచ్చిరెడ్డి గార్ల పిలుపు మేరకు జనవరి 20న అన్ని రీజియన్ మేనేజర్ కార్యాలయాల వద్ద నిర్వహించే ధర్నాకు తరలి రావాలని కోరారు. జనవరి 21 రోజున బస్సు భవన్ ముందర ఉదయం 12 గంటల నుండి, మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించే శాంతియుత బైఠాయింపు కార్యక్రమానికి బకాయిలు రావలసిన ప్రతి ఒక్కరూ "నా బకాయి డబ్బుల కొరకు నేను" అనే నినాదంతో పెద్ద ఎత్తున వేలాదిగా తరలి వచ్చి ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంచు లచ్చన్న, జి ఎస్ నారాయణ, శంకరయ్య, తిరుపతి రెడ్డి, జివిఎన్ రెడ్డి, కె ఎమ్ రావు, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.





లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

## కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**వేమనపల్లి, జనవరి 17, ప్రభాతవార్త**

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని వేమనపల్లి తహశీల్దార్ సాయికృష్ణ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీతో కలిసి 16 మందికి గాను మంజూరైన రూ.16,01856 విలువ గల చెక్కులను లబ్దిదారులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు వినియోగించుకొని ఆర్థికంగా లబ్దిపొందాలన్నారు. పేదింటి యువతుల వివాహానికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఎంతో లబ్దిచేకూరుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు ముల్కల్ల సత్యనారాయణ, మండల సర్పంచ్‌లు చెన్నూరి సమ్మయ్య, వుప్పులపు సాయికృష్ణ, కొట్టంగి శ్రీనివాస్, ముల్కల్ల శ్రీలత సత్యనారాణ, దుర్గం భాగ్యలక్ష్మి తిరుపతి, ఉప సర్పంచ్ దందేర మహేష్, నాయకులు ఆకుల లింగాగౌడ్, ఒడిల రాజన్న, గాలి మధు, తదితరులు పాల్గొన్నారు.

## కేస్లాపూర్ నాగోబా జాతర ఏర్పాట్లపై మీడియా సమావేశం

**- మహా పూజలు, నాగోబా దర్బార్ వివరాల వెల్లడి**

**ఆదిలాబాద్, జనవరి 17, ప్రభాతవార్త:**

ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కేస్లాపూర్ నాగోబా జాతర మహోత్సవాల నిర్వహణకు సంబంధించి శనివారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మేస్రం వంశీయులు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగోబా ఆలయ పీఠాధిపతి మేస్రం వెంకట్రావు పటేల్ మాట్లాడుతూ, జాతరలో భాగంగా నిర్వహించనున్న మహా పూజలు, సాంప్రదాయ కార్యక్రమాలు, నాగోబా దర్బార్‌కు సంబంధించిన పూర్తి వివరాలను మీడియాకు వెల్లడించారు. జాతర ప్రారంభం సందర్భంగా సంప్రదాయబద్ధంగా అభిషేకాలు, పవిత్ర గంగాజలంతో మహా పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గిరిజన సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే నాగోబా దర్బార్ కార్యక్రమం ద్వారా గిరిజనుల సమస్యలను చర్చించి పరిష్కార దిశగా ప్రభుత్వానికి వినతులు సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. మేస్రం వంశీయుల ఆచార సంప్రదాయాల ప్రకారం జాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా రవాణా, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించాలని అధికారులను కోరినట్లు తెలిపారు. కేస్లాపూర్ నాగోబా జాతరను విజయవంతం చేయడంలో మీడియా ప్రతినిధులు, భక్తులు, ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో సహకరించాలని మేస్రం వంశీయులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. అనంతరం నాగోబా జాతర ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ మీడియా సమావేశంలో డిపిఆర్ఓ విష్ణువర్ధన్, మేస్రం వంశీయులు చిన్ను పటేల్, కోసు, ఆనందరావు, దేవా రావు, శేఖర్, తుకారం, సంతోష్ (కేస్లాపూర్ సర్పంచ్) తదితరులు పాల్గొన్నారు.





నోము నిర్వహిస్తున్న వైశ్య సంఘం మహిళ సభ్యులు

## వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా గానుగ నూనె నోము

**మంచిర్యాల, జనవరి 17, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సంక్రాంతి పండగను పురస్కరించుకొని వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా గానుగ నూనె నోము నిర్వహించారు. సాంప్రదాయ భక్తిశ్రద్ధలతో కూడిన ఈ నోము వైశ్య సమాజ మహిళలకు ఆధ్యాత్మిక శక్తిని, కుటుంబ శుభాలను తెచ్చిపెట్టే ముఖ్యమైన ఆచారంగా ప్రసిద్ధి చెందిందని. ఉదయం తొలి కాంతులతోనే సంఘం మహిళలు స్నానాలాచరణ తర్వాత శుభ్రమైన పీతాంబరాలు ధరించి సమావేశమయ్యారు. గానుగ నూనె గానుగ ను పూజా స్థలంలో అలంకరించి, దానిపై పసుపు కుంకుమ, పూలు, అక్షతలతో పూజ చేశారు. గౌరమ్మ, లక్ష్మీ దేవి, వాసవీ మాతలకు ప్రత్యేకార్చనలు, నైవేద్యాలు సమర్పించారు. పద్మావతి, సరస్వతి వంటి మహిళలు నోము వ్రతం పాటిస్తూ భక్తిపూర్వకంగా మంత్రోచ్చారణ చేశారు. సంఘం సభ్యులు మాట్లాడుతూ, ఈ గానుగ నోము ద్వారా సమాజంలో స్త్రీల ఐక్యత, సాంప్రదాయ సంరక్షణ బలపడుతుందని తెలిపారు. చిన్నారులు, యువతీయువకులు కూడా ఈ వేడుకలో పాల్గొని సంతోషంగా ఉన్నారు. పూజ అనంతరం అందరికీ ప్రసాదం, పానకం, బెల్లంనువ్వులు పంచారు. సంక్రాంతి శుభాకాంక్షలతో పాటు గానుగ నోము ఫలితంగా కుటుంబాలకు సౌఖ్య సమృద్ధులు కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమం స్థానికంగా భక్తులందరినీ ఆకర్షించింది. వైశ్య సంఘం మహిళల ఈ ఘనమైన ఆచారం సమాజంలో మంచి మాదిరిగా నిలిచింది. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఇలాంటి నోములు సాంస్కృతిక వైవిధ్యాన్ని చాటాయి. మహిళల భక్తి, సేవా భావన ఈ సందర్భంగా మరింత ప్రకాశించాయి. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగాలని అందరూ కోరుకున్నారు. ఈ ఘనమైన గానుగ నోము వేడుకతో సంక్రాంతి ఆనందం మరింత రెట్టింపు అయింది. ఈ కార్యక్రమంలో నాగెల్లి జ్యోతి, సునీత, కావ్య, జ్యోతి తదితర 200 సభ్యులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణం

**- రహదారి భద్రతపై అవగాహన సదస్సులో**

**ఇన్స్‌పెక్టర్ శ్రీలత పిలుపు**

**నస్పూర్, జనవరి 17, ప్రభాతవార్త**

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవడమే లక్ష్యంగా పెట్టుకోవాలని శ్రీరాంపూర్ ఇన్స్‌పెక్టర్ శ్రీలత పిలుపునిచ్చారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ 3 వీటీసీ శిక్షణ కేంద్రంలో శనివారం రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న రహదారి ప్రమాదాలు పెద్ద సమస్యగా మారాయని శ్రీలత ఆందోళన వ్యక్తం చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్లే అత్యధిక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వివరించారు. హత్యల ద్వారా జరుగుతున్న మరణాల కంటే రహదారి ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య అధికంగా ఉండటం గమనార్హమని తెలిపారు. ప్రభుత్వాలు, పోలీసులు ఎన్ని చర్యలు చేపట్టినా, వాహనదారులు తమ వ్యక్తిగత బాధ్యతగా నిబంధనలు పాటించినప్పుడే మెరుగైన ఫలితాలు ఉంటాయని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల తమతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెడుతున్నారని వాహనదారులను హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే సమయంలో సీట్ బెల్ట్ ధరించడం మర్చిపోవద్దని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని, తల్లిదండ్రులు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మేకల సంతోష్ కుమార్, పోలీసు సిబ్బంది, సింగరేణి అధికారులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.




రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఇన్స్‌పెక్టర్ శ్రీలత, సిబ్బంది

# జిల్లాలో మున్సిపల్ వార్డుల రిజర్వేషన్ల ఖరారు

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, జనవరి 17, ప్రభాతవార్త**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని మున్సిపల్ వార్డుల రిజర్వేషన్లు ఖరారు చేయడం జరిగిందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లాలోని మున్సిపల్ వార్డుల వారీగా రిజర్వేషన్ కేటాయింపు ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 60 డివిజన్లు, బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో 34 వార్డులు, చెన్నూర్ మున్సిపల్ పరిధిలో 18 వార్డులు, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో 22 వార్డులు, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలో 15 వార్డులకు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, జనరల్ మహిళ, జనరల్ స్థానాలకు రిజర్వేషన్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

## గ్రామీణ యువతకు క్రీడా వేదిక... సీఎం కప్

**పెంచికల్ పేట్, జనవరి 17, ప్రభాతవార్త :**

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలపై ప్రజల్లో అవగహన కల్పించే ఉద్యేశంతో మండల కేంద్రంలో శనివారం ఎంపిడిఓ ఆధ్వర్యంలో జెడ్పిహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులతో కలిసి అవగహన ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ర్యాలీలో క్రీడల ప్రాముఖ్యత, యువతలో క్రీడాస్ఫూర్తి పెంపు, గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభను వెలికి తీసే లక్ష్యంతో సీఎం కప్ ను నిర్వహిస్తున్నట్లు నినాదల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ ఆల్బర్ట్ మాట్లాడుతూ, సీఎం కప్ ద్వారా గ్రామీణ యువతకు తమ ప్రతిభను ప్రదర్శించుకునే అరుదైన అవకాశం లభిస్తోందని తెలిపారు. ప్రతి గ్రామం నుంచి యువత ఈ పోటిల్లో పాల్గొని జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పోటీలు 17 నుండి 22వ తేదీ వరకు గ్రామస్థాయిలో, 27 నుండి 31 వరకు మండల స్థాయిలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ ర్యాలీలో తహసీల్దార్ తిరుపతి, ఎస్సై అనిల్ కుమార్ ఎంపిఓ మహేందర్ రెడ్డి ఎల్లూర్ సర్పంచ్ చప్పిడి రవీందర్, పంచాయతీ కార్యదర్శులు, ఏపిఓ సతీష్, టిఏలు, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు యాదగిరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ ఘాతంతో దగ్ధమైన గడ్డి కట్టలు

## ట్రాక్టర్‌కు తగిలిన విద్యుత్తు తీగలు... దగ్ధమైన గడ్డి కట్టలు

**పెంచికల్‌పేట్, జనవరి 17, ప్రభాతవార్త :**

మండలంలోని గోంట్లపేట గ్రామంలో పెద్దవాగు రోడ్డు మార్గం నుంచి గ్రామంలోకి వచ్చే ప్రధాన రోడ్డుపై ప్రమాదకర పరిస్థితి నెలకొంది. రోడ్డుకు ఇరువైపులా తక్కువ ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ వైర్లు వరిగడ్డి లోడ్ తో వెళ్తున్న ట్రాక్టర్ కు తలగలడంతో ట్రాక్టర్ పై ఉన్నా గడ్డి కట్టలు అంటుకున్న ఘటన శనివారం చోటుచేసుకుంది. ఈ ఘటనతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ అధికారుల నిరక్ష్యం ట్రాక్టర్ డ్రైవర్ అప్రమత్తతే సంఘటనకు కారణమని తెలిపారు. ఇదే రోడ్డుపై నిత్యం ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌ను సన్మానించిన ప్రవీణ్ నాయక్

**మందమర్రి, జనవరి17, ప్రభాతవార్త**



మందమర్రి ఏరియా సింగరేణి ఉద్యోగుల సంఘం నేత ప్రవీణ్ నాయక్ బెల్లంపల్లి నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్‌గా ఎన్నికైన రత్నం లక్ష్మిను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రత్నం ప్రదీప్ కూడా పాల్గొన్నారు. ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ, రాబోయే కాలంలో వ్యవసాయ శాఖకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేక చొరవ తీసుకుని ప్రణాళికాబద్ధంగా పరిష్కారాలు చూపాలని, నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి అభివృద్ధిలో వెనుకబాటుకు గురైన కాసిపేట మండలానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ పదవి రావడంలో కీలక పాత్ర పోషించిన కార్మిక-గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఎంపీ గడ్డం వంశీ, అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై అధికారులతో సమావేశమైన జీఎం శ్రీనివాస్

## ప్రగతి స్టేడియంలో గణతంత్ర వేడుకలు

### - అధికారులతో సమీక్ష నిర్వహించిన జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్

**నస్పూర్, జనవరి 17, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ కాలనీలోని ప్రగతి స్టేడియంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాలని జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శనివారం జనరల్ మేనేజర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏరియా అధికారులతో వేడుకల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఆయా విభాగాలు సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలు దేశభక్తిని పెంపొందించే విధంగా ఉండాలని మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో క్వాలిటీ విభాగం బెల్లంపల్లి రీజియన్ జనరల్ మేనేజర్ వీరభద్ర రావు, ప్రాజెక్టు అధికారులు ఏ. వెంకటేశ్వర రెడ్డి, చిప్ప వెంకటేశ్వర్లు, ఏజెంట్లు ఎన్. శ్రీధర్, రవికుమార్, డీజీఎంలు ఎస్. అనిల్ కుమార్, ఆనంద్ కుమార్, రవీందర్, మల్లయ్య, సర్వే అధికారి నర్సింగరావు, లా అధికారి మల్లేష్, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, సీహెచ్‌పీ ఎస్ఈ చంద్రలింగం, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, ఎన్విరాన్మెంటల్ అధికారి హనుమాన్ గౌడ్, వివిధ గనుల మేనేజర్లు, అధికారులు హాజరయ్యారు.

## నేడు శ్రీరాంపూర్ ఏరియాలో విద్యుత్ నిలిపివేత

**నస్పూర్, జనవరి 17, ప్రభాతవార్త**

మందమర్రిలోని 132/33 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని అన్ని కాలనీలకు ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏరియా డీజీఎం (పర్సనల్) అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. సబ్ స్టేషన్ నిర్వహణ పనుల దృష్ట్యా విద్యుత్ కోత ఉంటుందని అన్నారు. ఈ అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకుని శ్రీరాంపూర్ ఏరియాలోని కార్మికులు, అధికారులు, నివాసితులు సహకరించాలని కోరారు.



లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణి చేస్తున్న ఎమ్మెల్యే

## పేదలకు వరం కళ్యాణ లక్ష్మి పథకం

### - ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**తిర్యాని, జనవరి 17, ప్రభాతవార్త:**

కళ్యాణ లక్ష్మి పథకం పేదలకు వరంగా మారిందని ఆసిఫాబాద్ మ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శనివారం తిర్యాని మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కులను, అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ గొప్ప ఆలోచన కల్యాణ లక్ష్మి పథకం అని పేర్కొన్నారు. ఎంతోమంది పేద ఆడబిడ్డలకు తల్లిదండ్రులకు ఈ పథకం భరోసాను ఇస్తుందన్నారు. అలాగే కష్టాల్లో ఆసరాగా సీఎం రిలీఫ్ ఫండ్ తోడ్పడుతుందని బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియెగం చేసుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో వేముల మల్లేష్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు హనుమండ్ల జగదీష్, మాజీ ఎంపీపీ శ్రీదేవి, మాజీ జెడ్పిటిసిలు ఆత్రం చంద్రశేఖర్, వెడ్మ కమల మాజీ పిఏసిఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, వైస్ చైర్మన్ టెంట్ శ్రీనివాస్, పలు గ్రామాల సర్పంచ్‌లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## మాలమహానాడు నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

**పెంచికల్‌పేట్, జనవరి 17, ప్రభాతవార్త :**

మాలమహానాడు జిల్లా అధ్యక్షులు దుండ్ర శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా రూపొందించిన క్యాలెండర్‌ను పెంచికల్ పేట్ ఎస్సై అనిల్ కుమార్ చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దుండ్ర శ్రీనివాస్ మాట్లాడుతూ మాలమహానాడు సంస్థ సామాజిక ఐక్యత, సేవాభావంతో ముందుకు సాగుతుందని తెలిపారు. నూతన సంవత్సరం ప్రజలందరికీ శుభప్రదంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ వైస్ ప్రసిడెంట్ నాగరాజు పెంచికల్ పేట్ మండల అధ్యక్షులు పల్లెం పూరషోత్తం, ప్రధాన కార్యదర్శి మేకల హన్మంతు, నాయకులు శ్రీనివాస్, గుండయ్య, తిరుపతి, సుధాకర్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న ఎస్సై, మాలమహానాడు నాయకులు